అనసూయ అసూయ

[illegible]

"నేనోకమాట చెప్తానుగాని, అమ్మతో చెప్తావా వదినా?" అంది అనసూయ ప్రాధేయపూర్వకంగా.

"ఏవిటామాట? ఇప్పుడు నువ్వు శారదా వాళ్ళ యింటిదగ్గర్నుంచేనా రావటం? ఎలా వున్నాడు పెళ్ళికొడుకు?"

"చాలా బావున్నాడు. అబ్బా! ఎంతందంగా..."

"ఆహా! అంత బావున్నాడా?"

"ఆ-నువు నమ్మవ్ గాని, ఎందుకూ, నువు కూడా చూట్టానికి రావాల్సింది."

"మీ ఆయనకంటే బావున్నాడా?" అంది వదిన నవ్వుతూ.

అనసూయ మొహం చిట్లించి, "హు—ఆయన! అవకుండానే ఆయననేస్తున్నావే? ఆయనెక్కడా? ఈయనెక్కడా?" అంది. వదిన కొంత ఆశ్చర్యపోయింది. అల్లుకొంటున్న జడ అలా పట్టుకొని "అదేవిటే అనసూయా, అలాగంటావ్? రేపో మాపో వాళ్లు పసుపు కుంకుమా ఇచ్చుకోటానికొస్తూంటే, ఇంకా ఖాయమైయేదేముంది?" అంది అనసూయని చూస్తూ.

అనసూయ మొహం ఇంకోవేపు తిప్పుకొని, "నాకా సంబంధం ఇష్టంలేదొదినా. ఈ సంగతే అమ్మకి చెప్పు" అంది.

"ఏమిటీ? నీకా సంబంధం ఇష్టంలేదూ? నిజంగానా? మరయితే పెళ్ళిచూపులునాడు అడిగినప్పుడు నచ్చిందన్నావుగా. మళ్లా ఇప్పుడు నచ్చలేదంటున్నావా? ఏవిటిలా మారిపోయావ్?"

"అప్పుడన్నాననుకో. ఐతే మాత్రం ఇప్పుడు నాకిష్టంలేదు. ఇష్టంలేని పెళ్ళి చేసుకోమంటావా?"

"అలా ఎవరంటారు? నీ అభిప్రాయం ఎందుకో మారిపోయింది."

"అవును. అందమైనవాళ్లని వదిలిపెట్టి, అందంలేనివాళ్లని చేసుకోమంటే..."

"ఎవరా అందమైనవాళ్లు?"

"శారదను చూట్టానికొచ్చిన అబ్బాయి ఎంతందంగా వున్నాడో!"

"ఐతే? అతను శారదని చూట్టానికొచ్చాడుగాని నీకోసం కాదు."

"వాళ్లప్పుడే ఖాయపర్చేసుకొన్నారా? మనంకూడా అడగొచ్చుగా."

"అదా సంగతి? అందంగా ఉన్నంత మాత్రాన రాజాలాంటి సంబంధం వదులుకుంటానంటావేం? ఐనా పాలెం అబ్బాయికి అందం తక్కువని నువ్వే అనాలి. సుక్షేత్రంలాంటి పొలం, పాడీ పంటా, గొడ్డూగోదా వుండేసంబంధం యిదయ్యే. ఆ రాజమండ్రివాళ్లకేముంది? వెనకాలా స్తేమీ లేదుగదా, ఆ గుమాస్తా వుద్యోగం తప్పితే. గతిలేనివాడా రాఘవయ్య చేస్తున్నాడుగాని, మనలాంటి వాళ్లకేం కర్మ, ఆ స్తిలేని సంబంధం చేసుకోటానికి? ఒక్క అందంకోసం మంచీ చెడ్డా ఆలోచించటం లేదు నువ్వు" అంది మందలింపుగా వదిన. అనసూయ వదిన మొహంలోకి చూచి "నాకు పదికరాలు కట్నం ఇస్తున్నారుగా. వాళ్లకి ఆస్తి లేకపోతే నేం?" అంది నెమ్మదిగా.

"ఉన్నవాణ్ణే చేసుకొంటే, నువ్వు తీసుకెళ్ళేది కలిసి యింకా ఎక్కువౌతుంది? వాళ్లింటికెళ్లి, ఆఅబ్బాయిని చూసొచ్చి, ఇక అతనే కావాలంటావేమిటె అర్థంలేకుండా? ఇతనికంటే అందగాడింకొకడు కనపడితే

[illegible]

మళ్లా వాడే కావాలంటావా? ఐనా పాపమా రాఘవయ్య చచ్చీ, చెడీ ఆఖరికీసంబంధం తీసుకొచ్చుకుంటే, దానికి మనం పోటీగా వెళ్తే ఏంబావుంటుంది? బాగా ఆలోచించు. నిజానికి శారద, నీకన్నా బావున్నా, మన మిచ్చేకట్నం వాళ్ళివ్వలేరు కాబట్టి, మన సంబంధమే వప్పుకుంటారనుకో. కాని దీని వల్ల పాలెంవాళ్ల సంబంధం చక్కటి దీపోతుంది. రాఘవయ్యగారిమీద పోటీకెళ్ళి నట్టూ ఔతాము. ఏమంటావ్?"

"ఏవంటానికేముంది? నువ్వెన్ని చెప్పినా, నా అభిప్రాయం మారదు. మనం పోటీకెళ్లక పోతేమట్టుకు, పట్టుమని పదివేలైనా కట్నం యివ్వకపోతే, అంత అందమైనవాడు, ఎంతందంగావుంటేమాత్రం శారదని చేసుకొంటాడా? ఐనా ఎదటివాళ్ళకోసం మనం పోగొట్టుకొంటామేమిటి? కట్నం యిచ్చుకోలేనివాడికంతందమైన, అల్లుడెలావస్తాడు?–సరేగాని ఈవిషయం అమ్మతో చెప్పొదినా" అంది బతిమాలుతున్నట్లుగా అనసూయ.

"సరేలే. అలాగే చెప్తా. మధ్యలో నాకెందుకు?" అంటూ వెళ్ళిపోయింది వదిన. అనసూయ మనసా నవ్వుకొంది.

* * *

"పాలెంవాళ్లు వుత్తరం పంపారు. వాళ్ళ పాలేరు తీసుకొచ్చి యిచ్చాడు. నేను పొలంలో వుండగా" అన్నాడు భద్రయ్య భోజనానికి కూర్చుంటూ.

"ఏమని రాశారేవిటి?" అని అడిగింది భార్య అన్నపూర్ణమ్మ.

"ఎల్లుండి మంచిదట. పసుపూ కుంకం పుచ్చుకోటానికి వస్తామనీ, మనకేమైనా ఆటంకాలుంటే తెలియజెయ్యమనీ వ్రాశారు. నిన్నడిగి చెప్పొచ్చని పొలంలో ఏమాటా చెప్పలేదు. సాయంత్రం వుత్తరం రాసి వీరిగాడితో పంపాలి. రోజులుకూడా మీద కొచ్చేస్తున్నాయి. ఇక రెండుమూడు లగ్గాలకంటె ఎక్కువుండవు. కుదిరింతర్వాత ఆలస్యం దేనికి" అన్న పూర్ణమ్మ మాట్లాడలేదు.

"ఏం? మాట్లాడవ్?" అన్నాడు భద్రయ్య ప్రశ్నార్థకంగా చూస్తూ. కాస్సేపు తటపటాయించి "ఏమోనండి మరి" అంది—"ఏమో ఏమిటి నీమొహం? ఏసంగతీ చెప్పమంటే అలా నసుగుతావు" అన్నాడు చిరుకోపంతో.

"మధ్యలో నాకొచ్చిపడింది గొడవ. మీ దగ్గర నోరు తెరుద్దామంటే భయం. చెప్పకపోతే దాన్తోగొడవ. కోపం తెచ్చుకోకుండా కాస్త నెమ్మదిగా వినండి."

"సరేలే. అసలు సంగతేమిటో చెప్పు."

"అనసూయ పాలెం సంబంధం చేసుకోదట"

"ఏవిటీ? పాలెం సంబంధం చేసుకోదూ? ఏం?"

"దాని కాబ్బాయి నచ్చలేదట. రాఘవయ్యగారి శారదని చూట్టానికి రాజమండ్రీ నుంచి వచ్చాడూ—ఆ అబ్బాయిని చేసుకొంటుందట. ఇక మీ యిష్టం"

"అహా! ఇదొకటా? వాణ్ణిచేసుకొంటుందీ? వీణ్ణి చేసుకోదూ? ఏం? వాడికేమైనా కొమ్ములున్నాయా? పెళ్ళి చూపుల్నాడు నచ్చిందందిగా! మళ్లా ఏమైంది?"

"ఏమో! ఏమైందో. మేమూ చెప్పాం. కాని అది వినటం లేదు. పోనీ దాని కిష్టంలేని పెళ్ళిచేసి మనం మాత్రం ఏం బావుకోవాలి? శారదని చూసుకోటానికివ్వాళే వచ్చారు రాజమండ్రీ నుంచి. వెళ్ళిపోయారనుకుంటా. చాటుగా వాళ్ళ ఎడ్రసూ అదీ

కనుక్కొని ఓసారి రాజమండ్రీ వెళ్ళొచ్చండి. ఏమౌతుందో చూద్దాం."

"మరి పాలెం వాళ్ళకేం సమాధానం చెప్పాలి?"

"సమాధానానికేముంది? అందాకా ఏదో వంక పెట్టి రాజమండ్రీ సంబంధం కుదిరితే నిజం చెప్పొచ్చు."

"ఆ రాజమండ్రీ వాళ్ళకి ఆస్తీ అదీ లేదని విన్నానే. దానికోసం, చక్కని సంబంధం వదులుకోటం దేనికి? దాని మంచీ చెడ్డా మనకి తెలీదూ? ఇక దానిష్టమే? పిసమెత్తు ఆస్తిలేనివాణ్ణెందుకు చేసుకోవాలనుకొంటూందంట? నాకు చస్తే యిష్టంలేదు. అలో లక్ష్మణా అని ఏడుస్తుంది తర్వాత. ఆఁ బాగా ఆలోచించు." అన్నాడు భద్రయ్య కూతురికి మంచి చెయ్యాలనే తలంపుకొద్దీ. అన్నపూర్ణమ్మ కాస్సేపు వూరుకొని—

"అవుననుకోండి. ఇక దాని కిష్టం లేనప్పుడేం చేస్తాం? ఎవరికెంత రాసిపెట్టి వుంటే అంత" అంది.

"అంతే నంటావా? సరేలే. రోజులు ఆత్తికొచ్చేస్తున్నాయి. ఏ సంగతీ తొందరగా తేల్చుకోటం మంచిది" అంటూ గబగబా భోంచేసి చెయ్యి కడుక్కొని చావిట్లో కెళ్ళిపోయాడు భద్రయ్య.

తర్వాత అన్నపూర్ణమ్మ, అనసూయ, వదిన, భోజనాలకి కూర్చున్నారు. కాస్సేపటికి భద్రయ్య లోపలికొచ్చి భార్య చేతిలో వుత్తరం పెడుతూ "నేను రాజమండ్రీ వెళ్తొస్తానుగాని, యీ వుత్తరం వీరిగాడితో పాలెం పంపు" అని వుత్తరం యిచ్చి బయట కెళ్ళిపోయాడు. అన్నపూర్ణమ్మ ఆ వుత్తరాన్ని కోడలి చేతిలో పెడుతూ, "ఏం రాశారో చూద్దాం. చదవమ్మా" అంది. కోడలు శాంత వుత్తరాన్ని ఎడంచేత్తో పట్టుకొని చదివింది. అనసూయ తలవంచుకొని అన్నం తింటూ వింటోంది.

"శ్రీయుత నారాయణయ్య బావగారికి,

మీ క్షేమములు తెలిసినవి. ఇక్కడంతా క్షేమము. చిరంజీవుల వివాహ విషయమై ఖాయపర్చుకోటానికి, ఎల్లుండి రాబోతున్నామని వ్రాశారు. సంతోషం. కాని అనుకోని ఆటంకాలు సంభవించుటవల్ల ఎల్లుండి వీలుపడదని తెలియజేయవలసి వచ్చినది. త్వరలో సమయము చూచుకొని కబురు పంపెదము. చిరంజీవి రామారావు నడిగినట్లు చెప్పగలరు.

ఇంతే సంగతులు.

భద్రయ్య.

అని చదివి వినిపించింది శాంత. "బాగానే వుంది. ఎప్పటికేం జరుగుతుందో చెప్పలేం సుమా! అయిపోవలసిన సంబంధం తప్పటం నాకూ బాధగానే వుంది." అంది అన్న

"మీ దంతముల జాగ్రత్త పర్చండి!"

విజ్‌డమ్ దంత వైద్యుడు అది యెట్లో మీకు తెల్పును.



★ అనసూయ అసూయ ★

పూర్ణమ్మ బాధపడుతూ. "ఆఖరికి అనసూయమాటే నెగ్గింది. ఏం? అనసూయా! మీ ఆయన అంతందంగా వుంటాడా?" అంటూ వేళాకోళమాడింది కాంత అనసూయని. అనసూయ తలొంచుకొని భోంచేస్తూ ముసిముసిగా నవ్వుకొంది.

*　　*　　*

ఆనాడు రాజమండ్రీనుంచి పెళ్లిచూపులకు వస్తారని భద్రయ్యగారిల్లంతా హడావిడిగావుంది. రాబోయేవారిని సత్కరించటానికి భద్రయ్య ఏర్పాట్లన్నీ పెద్దపెట్టున చేయించాడు. అనుకొన్న సమయానికి పెళ్లికొడుకు చంద్రం, అతని తండ్రి పద్మనాభయ్య, వారితరఫు చుట్టాలింకొ యిద్దరు వచ్చారు. భద్రయ్య వారిని తోడుకొచ్చి చావిట్లో కూర్చోపెట్టాడు. టిఫిన్లూ, కాఫీలూ అయ్యాక అనసూయని చావిట్లో పరిచిన తివాచీమీద కూర్చోపెట్టారు. అనసూయ ముసిముసిగా నవ్వుకొంటూ, వారవారగా చూస్తూ కూర్చుంది. పెళ్లికొడుకు తరఫువాళ్లు ఏదో రివాజుప్రకారం, అమ్మాయిని అడగవలసినవి అడిగారు. తర్వాత అనసూయ లేచి వయ్యారంగా లోపలికెళ్లిపోయింది. కాస్సేపాగి భద్రయ్యగారి తరఫు మనిషి ఒకాయన "అమ్మాయిని చూచుకోటం ఐపోయింది కట్నం విషయం కూడా ఏమీ ఆలోచించ నక్కర్లేదు. అమ్మాయికి పదికరాల సుక్షేత్రం వప్పజెపుతారు. ఆపైన మిగిలిన, లాంఛనాలన్నీ యధావిధిగా జరుపుతారు. మీ అంగీకారం తెల్పండి మరి" అన్నాడు పెళ్ళిపెద్దల్ని చూస్తూ. "పదికరాలే!" అని లోలోపల ఆశ్చర్యపోతూ, "సరేనండి. ఇంటికెళ్లాక వ్రాస్తాం. ఇక వస్తాం మరి" అంటూ లేచాడు పెళ్లికొడుకు తండ్రి పద్మనాభయ్య. మంచిది ఏసంగతీ తొందరగా తెల్పండి. రోజులు మీద కొచ్చేస్తున్నాయి" అంటూ భద్రయ్యగారు, ఆయనతరఫు మనుషులూ పెళ్లివారిని పక్కవూరి స్టేషన్‌వరకూ సాగనంపి వచ్చారు.

ఈవార్త ఆపరేటూర్లో పొగలా వ్యాపించిపోయింది. "రాఘవయ్యకీ, భద్రయ్యకీ పోటీపడిందని" ఆశ్చర్యపోయారంతా. "రాఘవయ్య సంబంధం యిష్టం లేకపోబట్టే, యింకో సంబంధం చూచుకోటానికొచ్చారుగాని, లేకపోతే వస్తారా? ఇక రాఘవయ్య వాళ్లమీద ఆశ వదులుకోవచ్చు" అన్నారు కొంతమంది.

"పదికరాలిచ్చేభద్రయ్య సంబంధం వదిలిపెట్టుకొని, ఏదో ముష్టికట్నం వప్పజెప్పే రాఘవయ్య సంబంధం చేసుకొంటారా? అబ్బే, రాఘవయ్యెక్కడ పోటీపడగలడు భద్రయ్యతో" అనుకొన్నారు కొంతమంది. "ఇదంతా అనసూయ పట్టుదలేనట. కలిగినవాళ్లు కాబట్టి ఏం కోరినా తీరుతుంది. పాపం. ఆ శారదకి కావలసిన సంబంధం కాదూ యిది?" అనుకొన్నారు కొందరమ్మలక్కలు. మొత్తానికి వూరు వూరంతా యీ గొడవకి, అట్టుడికినట్టుడికి పోయింది. రాజమండ్రీవాళ్ల దగ్గర్నుంచీ ఎప్పుడేవార్త వస్తుందోనని ఎదురుతెన్నులు చూస్తున్నారంతా. ఆ వూరి పోస్టుమాస్టరు కూడా టపా రాగానే, రాజమండ్రి నుంచి వచ్చిన వుత్తరాలకోసం వెతికేవాడు.

శారదేనాడో ఆశ నిరాశ చేసుకుంది. రాఘవయ్య ఇతర సంబంధాలు చూడసాగాడు. అనసూయ, ఎప్పుడూ చంద్రం అందాన్నే తల్చుకొని మురిసిపోతూ వుండేది. ఒక్కోసారి మనస్సు కెంకించి "నాకంటే అందంగా వుండే శారదని మానేసి, నన్నెందుకు చేసుకొంటారు?" అని లోపలనుకోబోయి పైకనేస్తే, వదిన పక్కనుంచే చిన్నగా నవ్వి "పదికరాలిస్తున్నాంగదూ?" అనేది.

శారద ఏమనుకొంటోందో తెలుసుకోవాలని వుండేది అనసూయకి. ఓసారి మాటల సందర్భంలో వంటరిగా వున్నప్పుడు చిన్నినడిగింది. అనసూయ "శారదేం చేస్తోంది" అని.

"నీ మీదకి పోటీకిమాత్రం రాదులే. వాళ్లబాబు గడించలేదుగా మీ బాబులా" అంది నవ్వుతూ చిన్ని.

"స్నేహితురాల్ని వెనకేసు కొస్తున్నావ్‌గాని, గడింపులో ఏముంది? అదృష్టంలో వుందిగాని, పుణ్యంకొద్దీ పురుషుడు" అంది అనసూయ గర్వంగా. చిన్ని కాస్త ఆశ్చర్యపోయి "నీ అదృష్టం మాత్రం యింకా తేలీలేదుగా. ఏం జవాబొస్తుందో!" అన్నది.

అనసూయ ఓసారి చిన్నగా నవ్వి "నీకింకా అనుమానమేనా? పోనీలే ఆ కబురూ తెలుస్తుందిగా రేపో, మాపో. నాకు బాగా నమ్మకముంది. పెళ్లి చూపుల్నాడు అతను నా వేపెన్నిసార్లు చూశాడో నీకేం తెల్సు? ఇంకా ఎందుకుగాని అతన్ని శారద మర్చిపోవటం మంచిది అంది సగర్వంగా. చిన్ని మాట్లాడకుండా వెళ్లిపోయింది.

*　　*　　*

అందరూ ఎదురుచూసే రోజు రానే వచ్చింది. రెండు కవర్లు పట్టుకొని పరుగెత్తుకొచ్చాడు పోస్టుమాన్ భద్రయ్యగారింటికి. అప్పుడే భోంచేసి చావిట్లో పడుకొన్న భద్రయ్యగారు పోస్టుమాన్‌ని అల్లంత దూరంలో చూచి, ఎదురొచ్చి, చేతిలో వుత్తరం తీసుకొని "అప్పుడే వచ్చిందటోయ్ పోస్టు" అన్నారు వుత్తరాన్ని పరిశీలిస్తూ. "పోస్టు పెందరాడే వచ్చేస్తుంది కదండీ. అన్ని పన్లూ చూచుకొని మధ్యాన్నానికల్లా యిస్తాం.

ఈ ఉత్తరాలు రాజమండ్రీనుంచి వచ్చాయని వెంటనే యిచ్చిరమ్మన్నారు మేష్టారుగారు. పెళ్ళివారు రాశారనుకుంటానండి. ఏం రాశారో విందాం. చదవండీ. "అంటూ తొందరచేశాడు పోస్టుమాన్ భద్రయ్యగారిని. ఆయన చావిట్లోకొచ్చి, మడతకుర్చీలో చతికిలబడి," ఏయ్‌-నిన్నేనే, రాజమండ్రీనుంచి వుత్తరం వచ్చింది తొందరగారా. వినపడిందా. తొందరగా "అని పిలిచాడు లోపలికి చూస్తూ. "వస్తున్నానండీ" అనుకొంటూ అన్నపూర్ణమ్మ బైటకొచ్చింది. అనసూయ తల్లికొంగుపుచ్చుకొని నిలబడింది. "కోడలేదే? అందరూ రండి. విందురుగాని."

కొంచెం పనిమీద రాఘవయ్యగారింటికెళ్లింది.వచ్చాక చెబుదాం చదవండివిందాం"

ఆ చెడు
దగ్గును
ఆపుటకు
పెప్స్‌ను
సేవించుడు

PEPS
పెప్స్ గొంతు మరియు
FPY-39-TEL
సోల్ ఏజెంట్లు: దాదా & కంపెనీ,
88, సైనప్పనాయకన్ వీధి, మద్రాసు.

జ్ఞాపకశక్తి

"సరే, నా దగ్గిర మందు పుచ్చుకుంటున్నప్పటి నుంచీ, మీ జ్ఞాపకశక్తి ఎక్కువవుతోందంటారు. అంతేనా?" అని డాక్టరు రోగి నడిగాడు.

"అంత బాగాలేదుగానండీ, కొంచెం ఫరవాలేదండీ. ఏదో మరిచిపోయానని మాత్రం జ్ఞాపకం వస్తూ ఉంటుందండీ."

అంది అన్నపూర్ణమ్మ కంగారుగా భద్రయ్య కవరుచించి కాయితం చేతులో పట్టుకొని చదవసాగాడు.

శ్రీ భద్రయ్య గారికి ..

ఏ సంగతీ తెలియజెయ్యమన్నారు గాబట్టి వుత్తరం వ్రాస్తున్నాం. మీ అమ్మాయిని చేసుకోటానికి మా అబ్బాయి యిష్టపడటం లేదు."

అంతవరకూ చదివిన భద్రయ్యగారు తెల్లబోతూ చూశారు ఎదటివాళ్లి వంక. అనసూయ గతుక్కుమంది. "మిగిలింది కూడా చదవండి బాబూ విందాం" అన్నాడు పోస్టుమేన్. భద్రయ్యగారు తిరిగీ చదవటం సాగించారు-పెళ్ళిచూపులకు రావటానికి పేచీ పెట్టాడు. ఇంతకుముందే రాఘవయ్యగారింటికి రావటంవల్ల, ఇక వారమ్మాయినే గాని ఎవర్నీ చేసుకోనంటున్నాడు. "వాడు మనిషంత మనిషయ్యాక, నాయిష్టం ఏముంది? ఎంత కట్నంయిస్తే మట్టుకు వాడికిష్టంలేని పెళ్ళిచేసి ఏంబావుకోవాలి? అందుకని వాడిష్టప్రకారమే సాగనిస్తున్నాను. మీరు అన్యధా భావించక, అమ్మాయికి వేరే సంబంధం చూసుకోవలసిందిగా కోరుతున్నాను. ఇంతే సంగతులు. ఇట్లు

పద్మనాభయ్య."

ఏడిశావ్ లే. బోడివెధవ. బోడికోరటం. అంటూ భద్రయ్య ఆ వుత్తరాన్ని ముక్కలుగా చింపేశాడు కసిగా. "ఈ వుత్తరం రాఘవయ్య గారికిస్తాను తొందరగా." అంటూ పరుగెత్తాడు రెండో కవరు పట్టుకొని పోస్టుమాన్ చావిట్లోంచి వీధిలోకి. అనసూయ దుసదుసలాడ్తూ లోపలికెళ్ళి పోయింది అన్నపూర్ణమ్మ చావిట్లో చతికిలబడింది.

"పదికరాలిస్తామంటే కూడా నీలుగుతున్నాడే!"

ఐనా మనదే తప్పండీ. కానీ ఆ స్తితిలేని వాడిని పట్టుకొని పదికరాలిస్తామంటే యిముడ్చుకోవద్దూ? ఎర్రగా బుర్రగా వున్నానని విర్రవీగుతున్నాడు కావల్ను. ఐనా తప్పిపోయిందల్లా మనకే మంచిది, బస్తీవాళ్ళని నమ్మటం చెరుపే. వాళ్ళ జూలాయి తిరుగుళ్లకే సరిపోతుంది మనమిచ్చేదంతా. ఏదో చిన్నతనం. తెలీక పట్టుబట్టింది గాని, మళ్లా ఆ పాలెం వాళ్ళకి కబురు పంపండి. నిక్షేపంలాంటి సంబంధం. త్వరగా కానిచ్చు కోవచ్చు."

"నిజమే. సాయంత్రం వుత్తరం రాసి పంపుతాను. పసుపుకుంకము లిచ్చుకోటానికి రమ్మని వ్రాస్తాను. మళ్లా అమ్మాయితో ఏమయినా గొడవ వస్తుందేమో?"

"ఫర్వాలేదులెండి. ఈమధ్య దాని బుద్ధి పెడదార్లు పట్టిందిగాని, అసలు మొదట్లో వప్పుకోలా? తొందరగా వ్రాయండి ఉత్తరం."

ఇంతలో కాంత తొందర తొందరగా వచ్చింది.

"అత్తయ్యా! రాఘవయ్యగారికి రాజమండ్రీ వాళ్లు వుత్తరం రాశారు. మనకి రాయలా?"

"రాశార్లే వాళ్లకేం రాశారేమిటే?"

"శారదని చేసుకొంటారట. పసుపు కుంకమిచ్చుకోడానికి మంచిరోజు చూచి కబురు పంపమని వ్రాశారు. మరి అనసూయని చేసుకోమన్నారా?"

"ఆఁ వాళ్లంటే లెక్కా? వాడు గాకపోతే వాడి తాతలాంటివాడింకొకడు," అంటూ చావిట్లోనుంచి వెళ్లిపోయింది అన్నపూర్ణమ్మ.

* * *

"ఒరేయ్! రామం! మీమావగారుత్తరం పంపారురా—ఏమేవ్ వియ్యంకుడుత్తరం పంపాడు—" అన్నాడు నారాయణయ్య పొలంనుంచి వచ్చి చావిట్లో చెప్పులు విడిచి వంటింటి వేపొస్తూ

"ఎప్పుడు రమ్మని రాశారేమిటండీ" అనడిగింది భార్య యివతలికొస్తూ.

"సోమవారంనాడు మంచిదట రమ్మని వ్రాశారు. వస్తామని రేపుత్తరం రాసి పంపుతాను. ఏమంటావ్?"

"అలాగే తొందరగా కోడలొస్తే నాకూ మంచిదేగా."

గదిలోంచి యిదంతా వింటున్న రామారావు గుమ్మందగ్గర నిలబడి "మీ సంబంధం మా కక్కర్లేదని వ్రాసి పంపు నాన్నా" అన్నాడు గంభీరంగా. నారాయణయ్య తెల్లబోయి "ఏమిట్రా నువ్వనేది? సంబంధం అక్కర్లేకపోవటం ఏమిటి?" అన్నాడు అర్థంగాక. రామారావు తండ్రికేసి చూస్తూ "అవున్నాన్నా. తెలిసిం తర్వాత కూడా వాళ్లతో సంబంధమెందుకు మనకి? మనతో మాట్లాడుకొని, మళ్లా ఎవడికో ఇవ్వాలని చూట్టమా? తీరా వాళ్ళొప్పుకోలేదని మళ్లా మనకే అంటగట్టడమా? అంత చచ్చు దద్దమ్మలెవరూ లేరిక్కడ. మాకక్కర్లేదని వ్రాసెయ్" అన్నాడు కోపంగా.

"ఆ సంగతి నీకెలా తెలిసింది? అలా ఎందుకు చేస్తార్రా వాళ్లు?"

"మహా యింతోటి దూరానికి ఎక్కడేం జరిగేదీ తెలీసే తెలీదూ? పాలాన ఎప్పటికప్పుడు వాళ్లపాలేరే నాకు చెప్తూ వుంటాడు. రాజమండ్రి నుంచి ఎవరో, ఎవర్నో చూచుకోటానికొస్తే, ఆ అబ్బాయినే చేసుకొంటానని కూతురు పట్టుబడితే భద్రయ్య గారు రాజమండ్రి వెళ్లి, వాళ్లని తీసుకొచ్చాడట. అందుకే మనం కబురంపినప్పుడు ఏవో ఆటంకాలున్నాయని కబురంపారు. తీరా ఆ రాజమండ్రి అబ్బాయి ముందు చూసిన పిల్లనే చేసుకొంటానన్నాడట. ఇక మనమే కనపడ్డాం మళ్లా. మనకి కబురంపారన్న మాట. ఇంత గ్రంథం జరిగాక యిక ఆ అమ్మాయి కేమిష్టముంటుంది నామీద? అందుకే ముందే మేలుకోవటం మంచిది. మా కక్కర్లేదని వ్రాసెయ్యండి. నేనలా వెళ్ళొస్తా" అంటూ వెళ్లిపోయాడు రామారావు. తల్లిదండ్రులిద్దరూ తెల్లబోయి చూస్తూ వుండిపోయారు.

* * *

తత్ఫలితంగా ఆ ఏడాది అనసూయకి పెళ్లి కాలేదు. రోజులు మీదకొచ్చేయటం వల్ల మరో సంబంధం చూసుకోడానికి కూడ సమయం లేకపోయింది. చంద్రం అత్తవారింటి కొచ్చినప్పుడల్లా భద్రయ్యగారింటి ముందునుంచే తిరుగుతూ వుంటాడు. వీధిలో పోయే చంద్రాన్ని చాటుగా చూస్తూ వుంటుంది అనసూయ అసూయగా. ★